సాక్షి
తిరుపతి
మంగళవారం ⋅ 5 ⋅ డిసెంబర్ ⋅ 2023



అందోళన వద్దు.. అండగా ఉంటాం
భారీ వర్షాల నేపథ్యంలో జనం అప్రమత్తంగా ఉండాలని, తాము అండగా ఉంటామని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తెలిపారు. - 10లో



శ్రీవారి సేవలో పీఠాధిపతి
తిరుమల శ్రీవారిని సోమవారం శ్రీరంగం మఠం పీఠాధిపతి వరాహ మహాదేశికన్ దర్శించుకున్నారు. - 10లో



భవితకు కట్టు'బడి'
విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై విద్యార్థులు, తల్లిదండ్రుల ఆనందం వారి మాటల్లో.. - 10లో

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 4 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 70,349 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 20,535 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.4.10 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

శ్రీవారి సేవలో సినీ హీరో నాని



శ్రీవారి ఆలయం వెలుపల హీరో నాని

తిరుమల : తిరుమల శ్రీవారిని సోమవారం సినీ హీరో నాని సేవించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించారు. అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

పంటలపై అప్రమత్తం



ప్రసాద్‌రావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి

తిరుపతి అర్బన్: తుపాన్ నేపథ్యంలో పంటలు దెబ్బతినకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.ప్రసాద్‌రావు సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లావ్యాప్తంగా సుమారు 15వేల ఎకరాల్లో వరి పంట నీట మునిగిందన్నారు. ఇలాగే మరో రెండు రోజులపాటు వర్షాలు కొనసాగితే పంట రక్షణకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పొలంలో నీరు లేకుండా తీసివేయడంతోపాటు 5 సెంట్లకు 1 కేజీ యూరియా, 1 కేజీ పోటాష్ వేయడం ద్వారా కొత్త ఆకులు వచ్చి నారుమడి ఆరోగ్యంగా ఉంటుందన్నారు. కార్బెండిజమ్ 1 గ్రాము, 1 లీటర్ నీటితో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. మినుము, పెసల పంటలకు ఫెర్రస్ సల్ఫేట్ 5 గ్రాములు, సిట్రిక్ ఆమ్లం 5 గ్రాములు, యూరియా 20 గ్రాములు 1 లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని చెప్పారు. వారం తర్వాత మూడు 19 లేదా పోటాషియం నైట్రేట్‌ను 1శాతం ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. తెగుళ్ల నివారణకు హెకాస్‌కొనజోల్ 2 మిల్లీలీటర్లు లేదా ప్రోఫికొనజోల్ 1 మిల్లీలీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఇతర వివరాలకు మండల వ్యవసాయశాఖ అధికారులు, వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల్లోని అగ్రికల్చర్ అసిస్టెంట్లను సంప్రదించాలని కోరారు.

ట్రాన్స్‌కోకు రూ.14.4 లక్షల నష్టం



చిత్తూరులో మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లా పరిధిలో గాలివానకు సోమవారం రూ.14.4 లక్షలు నష్టం వాటిల్లిందని ఎస్ఈ కృష్ణారెడ్డి తెలిపారు. మొత్తం 59 గ్రామాల్లో విద్యుత్ పరికరాలు దెబ్బతినగా 188 మంది విద్యుత్ సిబ్బంది మరమ్మతులు చేసున్నారని వివరించారు.

పుష్కరిణిలో ప్రవేశంపై నిషేధం

తిరుపతి కల్చరల్: మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కపిలతీర్థంలోని జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో శ్రీకపిలేశ్వర స్వామివారి ఆలయ పుష్కరిణిలోకి భక్తుల ప్రవేశాన్ని తాత్కాలికంగా నిలిపివేసినట్లు టీటీడీ తెలిపింది. భక్తులు సహకరించాలని కోరింది.

విమాన సర్వీసులు రద్దు

రేణిగుంట : మిచాంగ్ తుపాను ప్రభావంతో రేణిగుంట విమానాశ్రయం రన్‌వేపై నీళ్లు చేరడం, వాతావరణం అనుకూలించకపోవడం వల్ల సోమవారం రేణిగుంట నుంచి నడిచే మొత్తం 18 విమాన సర్వీసులు రద్దయ్యాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే మంగళవారం కూడా విమాన సర్వీసులు రద్దవుతాయని విమానాశ్రయ అధికారులు తెలిపారు.

అరణియార్ వద్ద కాజ్‌వేపై చేరిన వరద నీరు



తుమ్మూరు వద్ద జాతీయ రహదారిపై కూలిన చెట్టు



నిండుగా ప్రవహిస్తున్న కైవల్యా నది





నాయుడుపేట వద్ద కాజ్‌వే పైకి ఉప్పొంగుతున్న స్వర్ణముఖి

వర్షం.. విలయం

మిచాంగ్ తుపాను ప్రభావంతో జిల్లాలో ఎడతెరపి లేని వర్షాలు కురుస్తున్నాయి. బలమైన ఈదురుగాలులకు పలు చోట్ల విద్యుత్ స్తంభాలు.. భారీ వృక్షాలు నేలకొరిగాయి. వాగులు.. వంకలు.. నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చెరువులు.. డ్యామ్‌లు.. ప్రాజెక్టులు నిండుకుండలను తలపిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. రహదారులపై వరద ఉప్పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ క్రమంలో అధికారులు ముమ్మరంగా సహాయక చర్యలు చేపట్టారు. ముంపు వాసులను పునరావాస కేంద్రాలకు తరలించారు. నిండిన రిజర్వాయర్ల గేట్లు ఎత్తివేసి నీటిని విడుదల చేశారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు.

- తుపాను బీభత్సం.. స్తంభించిన జనజీవనం
- సహాయక చర్యల్లో నిమగ్నమైన అధికార యంత్రాంగం
- 2,620 మందిని పునరావస కేంద్రాలకు తరలింపు
- వర్చువల్‌గా సమీక్షించిన సీఎం వైఎస్ జగన్
- అత్యవసర నిధుల కింద రూ.2 కోట్లు విడుదల
- బాధిత కుటుంబాలకు రూ.2,500 చొప్పున తక్షణ సాయం
- దెబ్బతిన్న ఇళ్లకు రూ.10వేల వంతున పంపిణీ
- జిల్లా ప్రత్యేకాధికారిగా శ్యామలరావు

తిరుపతి అర్బన్/తిరుపతి సిటీ/రాపూరు/వాకాడు/నాగలాపురం/పిచ్చాటూరు/ దక్కిలి(బాలాయపల్లె)/వెంకటగిరి(సైదాపురం)/శ్రీకాళహస్తి: జిల్లాలో తుపాను కారణంగా మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జనజీవనం అతలాకుతలమైంది. ప్రజలు అత్యవసరమైతే తప్ప గడప దాటడం లేదు. సోమవారం సుమారు గంటకు 70 కిలో మీటర్ల వేగంతో వీస్తున్న పెను గాలులకు చలి తీవ్రత పెరిగింది. పలు ప్రాంతాల్లో రహదారులపై వృక్షాలు కూలిపోయాయి. జిల్లావ్యాప్తంగా డ్యామ్‌లు, రిజర్వాయర్లు, ప్రాజెక్టులు నిండిపోవడంతో ముందస్తు జాగ్రత్తగా అధికారులు గేట్లు ఎత్తివేశారు. దీంతో లోతట్టు ప్రాంతాలలో నీరు చేరి సుమారు 70 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. బస్సు సర్వీసులను పలు గ్రామాలకు నిలిచిపోయాయి. విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో సుమారు 11 మండలాలు అంధకారంలో ఉన్నాయి. 31గ్రామాలలో సుమారు 2,620 మందిని ఇప్పటి వరకు పునరావాస కేంద్రాలకు తరలించారు. 162 మంది గర్భిణులను ప్రసూతి ఆస్పత్రుల్లో చేర్పించారు. జిల్లాలోని మొత్తం 2,557 చెరువులకు గాను, 1,500 చెరువులు నిండాయి. 10 ఏడీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యలు ముమ్మరంగా చేస్తున్నాయి.





పూలతోట వద్ద వరద ఉధృతికి ధ్వంసమైన రోడ్డు



దక్కిలి : కాజ్‌వే పైకి ప్రవహిస్తున్న నిండలి ఏరు

దెబ్బతిన్న పంటలు

భారీ వర్షాల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ఇప్పటికే 15వేల ఎకరాల్లో వరి , 400 ఎకరాల్లో మిరప, 200 ఎకరాల్లో కూరగాయల పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు అంచనా వేశారు. ఏర్పేడు మండలం చిందేపల్లె ఎస్టీ కాలనీలో గోడ కూలి మృతి చెందిన యశ్వంత్ అనే బాలుడి కుటుంబానికి ప్రభుత్వం రూ.4లక్షలు ఆర్థిక సాయం అందించింది

స్పెషల్ ఆఫీసర్ నియామకం

తుపాను సహాయక చర్యల పర్యవేక్షణకు జిల్లా ప్రత్యేకాధికారిగా ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి . శ్యామల రావ్‌ను నియమించారు. ఆయన వెంటనే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, నియోజకవర్గాల వారీగా పరిస్థితులను సమీక్షిస్తున్నారు. తిరుపతిలోని ఎస్వీయూ, అగ్రికల్చర్ కాలేజీ ప్రాంగణాల్లో పలు చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ తీగలు తెగిపోవడంతో హాస్టళ్లకు కరెంట్ సరఫరా ఆగిపోయింది. భారీ వర్షాలకు ఉద్యోగులు, విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. త్వరితగతిన పునరుద్ధరించనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు.

ముందుకొచ్చిన సముద్రం

వాకాడు మండలం తూపిలిపాళెం వద్ద సముద్రం దాదాపు 20 మీటర్లు ముందుకు వచ్చింది. అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. పలు చోట్ల వరద నీరు రహదారులపై ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఓడపాళెం లైట్‌హౌస్ వద్ద 300 అడుగుల వాతావరణ హెచ్చరిక టవర్ నేలకొరిగింది. మండలంలో దాదాపు 3,220 ఎకరాల్లో వరి నాట్లు నీటమునిగాయి.

తిరుమలలో నిండిన జలాశయాలు

తిరుమలలోని పాపవినాశనం, ఆకాశగంగ, గోగర్భం, కుమారధార, పసుపుధార జలాశయాలు పూర్తిగా నిండిపోయాయి. తిరుమలలో కేవలం 24 గంటల్లోనే 100 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

అరణియార్ గేట్లు ఎత్తివేత

పిచ్చాటూరు మండలంలోని అరణియార్ ప్రాజెక్టులలో నీటి మట్టం 28 అడుగులకు చేరడంతో గేట్లు ఎత్తివేశారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ముందుగా గంగాదేవికి పూజలు నిర్వహించి నాలుగు స్పిల్ వే గేట్లను పైకెత్తి అధిక నీరు విడుదల చేశారు. ఈఈ మదన్‌గోపాల్ మాట్లాడుతూ గంటకు 12 వేల క్యూసెక్కుల నీరు జలాశయానికి వస్తోందన్నారు. అందుకే గేట్లను 5 అడుగు చొప్పున పైకెత్తి 10 వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు వివరించారు.

కండలేరు పరిశీలన

రాపూరు మండలంలోని కండలేరు జలాశయాన్ని నిరంతరం పరిశీలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. లోలెవల్ స్లూయిజ్ గేట్లను, హెడ్ రెగ్యులేటర్ వద్ద నీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు గమనిస్తున్నామని వెల్లడించారు.

నిండు గర్భిణిని చేతులపై మోస్తూ..

నాగలాపురం మండలంలోని కొత్తకాడు గ్రామంలో సంధ్య అనే గర్భిణికి సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటకు పురిటినొప్పులు ప్రారంభమయ్యాయి. భారీ వర్షం కారణంగా గ్రామ సమీపంలోని వాగు ఉప్పొంగడంతో ఎక్కడికక్కడ వాహనాలు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో గ్రామస్తులు, కుటుంబీకులు ఆమెను చేతులతో మోసుకుంటూ వాగు దాటించి, ఆస్పత్రికి తరలించారు.

చలితీవ్రతకు వృద్ధురాలి మృతి

వాకాడు మండలం గొల్లపాళెం గ్రామానికి చెందిన బందిల పొండమ్మ(63) అనే వృద్ధురాలు సోమవారం చలితీవ్రతకు మృతి చెందింది.

షెడ్డు కూలి దూడలు..

భారీ వర్షాలకు బాలాయపల్లి మండలం పిగిలాం గ్రామంలో ఓ రేకులు షెడ్డు కూలిపోయింది. దీంతో కింద ఉన్న నాలుగు దూడలు మృతి చెందినట్లు బాధితులు తెలిపారు.

విరిగిపడిన కొండచరియలు

తుపాను నేపథ్యంలో సోమవారం కురిసిన భారీ వర్షానికి శ్రీకాళహస్తీశ్వరాలయ సమీపంలోని కైలాసగిరి కొండచరియలు విరిగిపడ్డాయి. అప్రమత్తమైన అధికారులు వెంటనే కొండ దారి మూసివేశారు.

ముఖ్యమంత్రి సమీక్ష



ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, ఎస్పీ, జేసీ

తుపాన్ ప్రభావం.. సహాయక చర్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాకు తక్షణ సాయంగా రూ.2కోట్లు విడుదల చేశారు. పునరావాస కేంద్రాల్లోని బాధితులు ఇళ్లకు వెళ్లేప్పుడు ఒక్కో వ్యక్తికి రూ.వెయ్యి లేదా కుటుంబానికి రూ.2,500 చొప్పున ఆర్థిక సాయం అందించాలని ఆదేశించారు. దెబ్బతిన్న ఇళ్ల మరమ్మతులకు రూ.10వేలు పంపిణీ చేయాలన్నారు. అలాగే 25 కేజీల బియ్యం, కిలో చొప్పున కంది పప్పు, పామాయిల్, ఉల్లిపాయలు, బంగాళాదుంపలను అందజేయాలని స్పష్టం చేశారు. సమీక్షలో కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వరరెడ్డి, జేసీ డీకే బాలాజీ, డీఆర్‌ఓ పెంచల కిషోర్ పాల్గొన్నారు.

పక్కాగా 'పునరావాసం'



వరద తీవ్రతను పరిశీలిస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురు మల్లిరామ్‌కుమార్‌రెడ్డి రెండు రోజులుగా సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. సోమవారం ఆయన పలు ప్రాంతాల్లో పర్యటించారు. బాధితులకు ఆహారం, నిత్యావసర సరుకులు అందజేశారు. బాలాయపల్లె మండలంలోని నిండలి వద్ద కైవల్యావాగును పరిశీలించారు. లింగమనాయుడుపల్లె, మార్లగుంట, దగ్గవోలు, మాటుమడుగు, పాతనాలపాడు, శివగిరి, హస్తకావేరి, అంబలిపూడి, తోచాం, గులించెర్ల, చీకవోలు, మొలకలపూండ్ల, గిద్దలూరులో పునరావస కేంద్రాలను ఏర్పాటు చేయించారు. తుపాను బాధితులు ఇబ్బంది పడకుండా చర్యలు చేపట్టారు.



ఇసుకతాగేలిలో నేలకొరిగిన బొప్పాయి చెట్టు



శ్రీకాళహస్తిలో విరిగి పడిన కొండచరియలు



తుంగపాళెంలో నీట మునిగిన గుడిసె



రోడ్డుపైకి ఉప్పొంగిన మారేడు కాలువ

నేడు విద్యాసంస్థలకు సెలవు

తుపాన్ నేపథ్యంలో మంగళవారం విద్యాసంస్థలకు కలెక్టర్ సెలవు ప్రకటించారు.



గూడూరు వద్ద పంబలేరు ఉధృతి



బత్తలనల్లం వద్ద వరద



వేములపాళెం వద్ద రోడ్డుపై ప్రవాహం



వాకాడు- చిట్టమూరు మార్గంలో వర్షపు నీరు



చిల్లకూరు : పునరావాసకేంద్రాలకు తరలింపు

బాసటగా నిలుస్తూ.. భరోసా కల్పిస్తూ..!



శివపురం కాలనీలో పర్యటిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్ : తుపాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు తిరుపతి రూరల్ మండలం ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. పెను గాలులకు పలు చోట్ల భారీ వృక్షాలు నేలకూలడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. ప్రధానంగా స్వర్ణముఖి నది పరీవాహక గ్రామాల వాసులకు కంటి మీద కునుకు లేకుండా పోతోంది. తిరుచానూరు, పాడిపేట, సాయి నగర్ పంచాయతీల పరిధిలో లోతట్టు ప్రాంతవాసుల ఇబ్బందులను తెలుసుకున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అక్కడకు వెళ్లి బాధిత కుటుంబాలకు బాసటగా నిలిచారు. పాడిపేట వద్ద కూలిన భారీ వృక్షాన్ని తొలగింపజేశారు. అలాగే ముంపు ప్రాంతాలను గుర్తించి అక్కడి ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. బాధితులకు వసతి, భోజన సదుపాయాలు కల్పించారు. భారీ వర్షాల నేపథ్యంలో ఎవరూ ఇంటి నుంచి బయటకు రావద్దని సూచించారు. కాలువలు, వాగులు దాటేందుకు ప్రయత్నించవద్దని కోరారు. రెవెన్యూ, పంచాయతీ, సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రజా ప్రతినిధులు, పార్టీ నేతలు ప్రజలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రామచంద్రారెడ్డి, ధనమునిరెడ్డి, డీపీ రమణ పాల్గొన్నారు.



తుపాను బాధితులతో మాట్లాడుతున్న మోహిత్‌రెడ్డి

సైన్స్ అండ్ టెక్నాలజీపై జాతీయ సదస్సు

తిరుపతి సిటీ: తిరుపతి చాప్టర్ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఉమెన్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ సస్టైనబుల్ ఫ్యూచర్ అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు సోమవారం వర్సిటీలో ప్రారంభమైంది. ఈ సదస్సుకు ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్ మాజీ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డి నారాయణ రావు ప్రధాన వక్తగా హాజరైన సైన్స్ అండ్ టెక్నాలజీలో మహిళల పాత్రపై సుదీర్ఘ ప్రసంగం చేశారు. అనంతరం పర్యావరణ ప్రాముఖ్యతను వివరించారు. ఈ సదస్సులో వర్సిటీ వీసీ భారతి, తిరుపతి చాప్టర్ చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ రామమూర్తి, డాక్టర్ విజయ లక్ష్మి సక్సేనా, బెంగళూరు చాప్టర్ కన్వీనర్ గంగాధర్, సదస్సు కన్వీనర్ డాక్టర్ కె పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ నారాయణరావు

కర్ణాటక మద్యం సీజ్.. నిందితుడి అరెస్టు

చిత్తూరు అర్బన్: కర్ణాటక నుంచి కారులో మద్యం తరలిస్తున్న కె.జ్యోతీశ్వరయ్య (38) అనే నిందితుడ్ని ఎస్ఈబీ చిత్తూరు రూరల్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సీఐ చంద్రశేఖర్, ట్రైనీ ఏఈఎస్ శ్రీరామ్ ఆధ్వర్యంలో బంగారుపాళెం మండలం గాజులపల్లె రోడ్డు వద్ద తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో ఇటు వైపుగా వస్తున్న ఓ కారు పోలీసులను గమనించి వేగంగా వెళ్లడానికి ప్రయత్నించగా వారు చాకచక్యంగా పట్టుకున్నారు. కారులో తనిఖీలు చేయగా 288 కర్ణాటక మద్యం ప్యాకెట్లు ఉండడంతో జ్యోతీశ్వరయ్య అరెస్టు చేసి, మేజిస్ట్రేట్ ఆదేశాలతో రిమాండుకు తరలించారు. ఈ దాడుల్లో ఎస్ఐ మోహన్‌బాబు, సిబ్బంది కృష్ణయ్య, సుబ్రమణ్యం, కిరణ్‌కుమార్, వెంకటేష్, మమత తదితరులు పాల్గొన్నారు.

భవితకు కట్టుబడి

విద్యారంగంలో విప్లవాత్మకమైన సంస్కరణలను ప్రభుత్వం అమలు చేస్తోంది. పేద విద్యార్థుల ఉన్నత భవితకు బంగారు బాటలు వేస్తోంది. ముందుగా నాడు–నేడు పథకం కింద సర్కారు పాఠశాలలను అద్భుతంగా తీర్చిదిద్దింది. పోటీ ప్రపంచంలో దీటుగా నిలబడేందుకు ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టింది. సెంట్రల్ స్కూళ్లకే పరిమితమైన సీబీఎస్‌సీ సిలబస్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకునేలా డిజిటల్ తరగతులను ప్రారంభించింది. ట్యాబ్‌ల ద్వారా బైజూస్ కంటెంట్‌తో పిల్లలు ఇంటి వద్ద సైతం అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరుచుకునేలా కార్యాచరణ చేపట్టింది. విద్యావ్యవస్థను కొత్త పుంతలు తొక్కిస్తున్న ప్రభుత్వ విధానాలపై విద్యార్థులు.. తల్లిదండ్రుల ఆనందం వారి మాటల్లోనే..

– తిరుపతి అర్బన్

జనవాక్కు


వాసు,ఉపాధ్యాయుడు,కుప్పంబాదూరు పాఠశాలలో ఐఎఫ్‌బీ ద్వారా బోధన

నాణ్యమైన విద్య



నాడు–నేడుతో మా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల పూర్తి వసతులతో ఆకర్షణీయంగా మారింది. గతంలో మాదిరిగా కాకుండా ఇప్పుడు నాణ్యమైన విద్య అందిస్తున్నారు. దీంతో మా పిల్లల చదువుల బెంగ తప్పింది. ఇంగ్లిష్ మీడియంలో పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారు. ప్రతిభావంతులైన ఉపాధ్యాయులు అందుబాటులో ఉంటున్నారు. దీంతో మా పిల్లలు శ్రద్ధగా చదువుకుంటున్నారు. ఇక ఎవరూ ప్రైవేటు స్కూల్ వైపు చూడాల్సిన అవసరం లేదు.

– శ్రీనివాసులు, విద్యార్థి తండ్రి, కాశీపురం,

రూపురేఖలు మారాయి



మా ఊరి బడికి గతంలో శిథిలావస్థలో ఉండేది. పిల్లలకు కనీస వసతులు కూడా ఉండేవి కావు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాడు–నేడు పథకం కింద మా గ్రామంలోని పాఠశాలను అత్యున్నతంగా తీర్చిదిద్దారు. మరుగుదొడ్లు, విద్యార్థులకు సౌకర్యవంతమైన బల్లలు, తరగతి గదుల్లో ఫ్యాన్లు, ఆహ్లాదకరంగా గోడలపై చిత్రాలతో బడి రూపురేఖలే మారిపోయాయి. దీంతో పిల్లలు సర్కారు పాఠశాలల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. **– షబానా, నెన్నూరు,రామచంద్రాపురం మండలం**

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



మా కుమార్తె యామిని మా ఊళ్లోని ప్రభుత్వ బడిలో ఎనిమిదో తరగతి చదువుతోంది. కుమారుడు పూజిత్ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. నాడు–నేడు కింద పాఠశాలల్లో సకల వసతులు కల్పించారు. ప్రైవేట్ స్కూళ్లకు మించి సౌకర్యాలు ఉన్నాయి. ఇంగ్లిష్ మీడియంలో నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నారు. దీంతో మా పిల్లలు చక్కగా చదువుకుంటున్నారు. పేద విద్యార్థులు మేలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– సంధ్య, ఎస్‌బీఆర్ పురం, వడమాలపేట మండలం

ఆనందంగా ఉంది



మేము వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్నాం. రెక్కాడితే కానీ, డొక్కాడని బతుకులు. మా కుమారుడు వెంకటచైతన్యను చదువుల ఖర్చులు భరించేందుకు నానా అవస్థలు పడ్డాం. జూన్ వస్తే ఫీజులు చెల్లించేందుకు అప్పు చేయాల్సి వచ్చేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామంలోని పాఠశాలను పట్టణ ప్రాంతాల్లోని కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తయారు చేశారు. దీంతో మా ఊళ్లోని బడిలోనే చేర్పించాం. యూనిఫాం, బూట్లు, బెల్టు, పుస్తకాలు తదితర సామగ్రిని ప్రభుత్వమే అందించింది. మా బిడ్డ హాయిగా చదువుకుంటుంటే ఆనందంగా ఉంది.

– కష్టమ్మ, పాతనాలపాడు, దక్కిలి మండలం

మెరుగైన వసతులు



మా గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మా కుమారుడు 8వ తరగతి చదువుతున్నాడు. గతంలో ఈ పాఠశాల దయనీయస్థితిలో ఉండేది. కనీస వసతులు కూడా కరువే. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాడు–నేడు పథకంలో భాగంగా రూ.30లక్షలకు పైగా ఖర్చు చేసి పాఠశాలను ఎంతో అందంగా తీర్చిదిద్దారు. మెరుగైన వసతులు కల్పించారు. ప్రైవేటు స్కూళ్లకు దీటుగా తయారు చేశారు. పేద విద్యార్థులు చదువుకునే బడులను ఉన్నతంగా రూపురేఖలు మార్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు. **– దాము, విద్యార్థి తండ్రి, కందాడు, ఏర్పేడు మండలం**

జర జాగ్రత్తగా ఉండాలి

చిత్తూర రూరల్: వర్షాలతో ప్రజలను అప్రమత్తం చేస్తూ జర జాగ్రత్తగా ఉండేలా చూడాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతీదేవి అన్నారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో సోమవారం మండల వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, మాట్లాడారు. కురిసే వర్షాలు అంటువ్యాధులు, విష జ్వరాలు వచ్చే అవకాశాలున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. శుభ్రత పాటించాలన్నారు. జ్వరం కేసు కనిపిస్తే వెంటనే వైద్య సేవలు అందించాలని సూచించారు.

మెరుగైన డ్రైనేజీతో మంచి ఫలితాలు


మాట్లాడుతున్న మేయర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

- ఆమోదించిన మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో ఇదివరకు చిన్నపాటి వర్షానికే రోడ్లు జలమయంగా మారేవని, కార్పొరేషన్ ముందు చూపుతో చేపట్టిన మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ కారణంగా మంచి ఫలితాలు వచ్చాయని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. సోమవారం తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ శిరీష అధ్యక్షతన స్టాండింగ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. కమిషనర్ హరిత అజెండా అంశాలను ప్రవే శపెట్టారు. అజెండా అంశాలపై డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు నరసింహాచారి, గణేష్, ఉమాఅజయ్, కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు పాల్గొని, చర్చించి ఆమోదం తెలిపారు. డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ నేడు రికార్డు స్థాయిలో 125 మిల్లీమీటర్ల వర్షం కురిసినా చుక్క నీరు కూడా నిలువకుండా చేయడం అభినందనీయమన్నారు.

కౌన్సిల్ ఆమోదించిన ముఖ్య అంశాలు

కళ్యాణి డ్యాం వద్ద ఉన్న రెండు ఫిల్టరేషన్ ప్లాంట్లు, అలిపిరి వద్ద ఫిల్టరేషన్ ప్లాంట్, టౌన్ సర్వీస్ రిజర్వాయర్, బీపీ ట్యాంకుల వద్ద నీటిని శుద్ధి చేయడం. మంగళం వద్ద ఫిల్టరేషన్ ప్లాంట్ల విషయం, తెలుగుగంగ నీటిని శుద్ధి చేయుటకు ఉపయోగించు వేపొరైజ్డ్ లిక్విడ్ క్లోరిన్ గ్యాస్, ఫెర్రిక్ ఆలమ్ లిక్విడ్ క్లోరిన్ ఒక సంవత్సరానికి కొనుగోలు చేయుటకు 50 లక్షలు, 49.95 లక్షలు కేటాయిస్తూ ఆమోదించారు. క్రాంతి నగర్ నుంచి సత్యనారాయణపురం పాఠశాల వరకు సీసీ రోడ్డు నిర్మించడానికి 49.95 లక్షలు, కరకంబాడి రోడ్డులో సెంట్రల్ డివైడర్‌పై గ్రీనరీ పెంచుటకు 49.15 లక్షలు, రేణిగుంట రోడ్డు స్కోడా షోరూం ఎదురుగా తూకివాకం వైపు వెళ్తున్న పగిలిన పైపులను తొలగించి పునరుద్ధరించుటకు 49.50 లక్షలు, నూతనంగా ఎస్టీవీ నగర్ రోడ్డు, కాలువలు, రాఘవేంద్ర నగర్ మెయిన్ రోడ్డు వేయించేందుకు 46 లక్షలు, గొల్లవానిగుంట వద్ద కాలువలు నిర్మించుటకు 43 లక్షలు, మధురానగర్ మున్సిపల్ పార్క్ పడమర భాగం రోడ్డు వేయించేందుకు 36.65 లక్షలు, మరికొన్ని పనులకు ఆమోదం తెలుపుతూ స్టాండింగ్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

శ్రీవారి సేవలో శ్రీరంగం మఠం పీఠాధిపతి


పీఠాధిపతి వరాహ మహాదేశికన్‌తో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

తిరుమల : తిరుమల శ్రీవారిని శ్రీరంగం మఠం పీఠాధిపతి, ఆండవన్ ఆశ్రమ ప్రధాన పీఠాధిపతి వరాహ మహాదేశికన్ (ఆండవన్) దర్శించుకున్నారు. సోమవారం శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి స్వాగతం పలికారు. అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఆందోళన వద్దు.. అండగా ఉంటాం


సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

–ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. తాము అండగా ఉంటామని ఎమ్మెల్యే బియ్యపు మధసూదన్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి పట్టణం 4వ వార్డు పరిధిలోని ఏనుగుల గుంట చెరువు సమీపంలో ఉన్న లోతట్టు ప్రాంతాల్లో సోమవారం ఆయన పర్యటించారు. ఎలాంటి సమస్య ఉన్నా తన ఫోన్ నంబర్ 9845009152కు కాల్ చేయాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు భోజనాలు, వసతి ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అధికారులు ముందస్తు చర్యలు తీసుకున్నారని.. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ధైర్యం చెప్పారు. ఆయనతో పాటు శ్రీకాళహస్తి పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, పార్టీ నాయకులు పగడాల రాజు, పంతులు, శంకర్, ప్రభాకర్, భారతి, మున్నా, పఠాన్ ఫరీద్ ఉన్నారు.

దాతృత్వం ఎనలేనిది


జగనన్న ఉచిత మొబైల్ అన్నదాన క్యాంటీన్ ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

చిత్తూరు కలెక్టరేట్ : 'ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి దాతృత్వం ఎనలేనిది. పేదల ఆకలి తీర్చేందుకు జగనన్న మొబైల్ ఉచిత అన్నదాన క్యాంటీన్‌ను నెలకొల్పడం గొప్ప విషయం', అని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి స్ఫూర్తితో ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి జగనన్న ఉచిత క్యాంటీన్ పేరు తో మొబైల్ వాహనాన్ని నెలకొల్పారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ఈ వాహనాన్ని డిప్యూటీ సీఎం నారాయణస్వామి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం మాట్లాడుతూ విజయానందరరెడ్డి ఏర్పాటు చేసిన జగనన్న క్యాంటీన్ ద్వారా నగరంలో రోజుకు 500 మందికి ఉచితంగా అన్నదానం చేయనున్నారని చెప్పా రు. వైఎస్సార్‌సీపీ ఏర్పడినప్పటి నుంచి విజయానందరెడ్డి అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి మాట్లాడుతూ ప్రతిరోజు 500 మందికి నగరంలోని వివిధ ప్రాంతాల్లో అన్నదానం చేయనున్నట్లు తెలిపారు. ప్రతి సోమవారం కలెక్టరేట్, మంగళవారం కోర్టు ఆవరణ, బుధవారం పాత బస్టాండ్, గురువా రం గాంధీ సర్కిల్ శుక్రవారం మసీదుల వద్ద, శనివారం పీసీఆర్ సర్కిల్, ఆదివారం చర్చిల వద్ద జగనన్న క్యాంటీన్ మొబైల్ వాహనం ద్వారా అన్నదా నం చేయిస్తామని చెప్పారు. సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి 2024 ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి రావాలని ఆకాంక్షించారు. పేదల కోసం సీఎం జగన్ మోహన్ రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని, సంక్షేమ పథకాలతో పేదల అభ్యున్నతికి తోడ్పాటునందిస్తున్నారన్నారు. అనంతరం డిప్యూటీ సీఎం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేశ్‌కుమార్‌రెడ్డి, కార్పొరేటర్లు మధు, శ్రీకాంత్, అంబురాసనపల్లి ప్రకాశ్, అల్తాఫ్ కౌసర్, కవిత, దలవాయి శివ, నవాజ్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ దొంగల అరెస్టు


నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

కార్వేటినగరం: అంతర్జాతీయ దొంగల ముఠాను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు కార్వేటినగరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పీ. సత్యబాబు తెలిపారు. సోమవారం సీఐ కార్యాలయంలో అంతర్జాతీయ దొంగలను అరెస్టు చూపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పాలసముద్రం మండలం బలిజకండ్రిగలో ఓ ఇంట్లో చోరీ జరిగినట్లు అందిన ఫిర్యాదుతో డీఎస్పీ రవికుమార్ ఆధ్వర్యంలో టీమ్ ఏర్పాటు చేసి దర్యాప్తు చేసినట్లు తెలిపారు. దీంతో సోమవారం ఉదయం బలిజకండ్రిగ క్రాస్ వద్ద వాహనాల తనిఖీ నిమిత్తం రెండు ద్విచక్రవాహనాల్లో వెళుతున్న వారిని ఆపడంతో వారు వాహనాల వేగాన్ని పెంచి పరారయ్యేందుకు యత్నించడంతో అనుమానం వచ్చి వారిని అదుపులోకి తీసుకుని విచారణ జరిపామన్నారు. తమిళనాడులోని రాణిపేట జిల్లా జిబ్టేరి కాలనీకి చెందిన శశికుమార్ కుమారుడు ఎస్.పొన్మణి, తిరుపతి జిల్లా పిచ్చాటూరు మండలం శ్రీరామపురం గ్రామానికి చెందిన చిరంజీవి కుమారుడు ఆనంద్, తమిళనాడులోని తిరవళ్లూరు జిల్లా వీసీఆర్ కండ్రిగ గ్రామానికి చెందిన మునియప్పన్ కుమారుడు ఎం.కిషోర్, అదే గ్రామానికి చెందిన రవి కుమారుడు ఆర్.కార్తీక్‌గా గుర్తించామని చెప్పారు. నిందితుల నుంచి రెండు ద్విచక్రవాహనాలు, మూడు ల్యాప్‌టాప్‌లు, 18.7 గ్రాముల పగడాల బంగారు చైనుతో పాటు ఉంగరం, కమ్మలు, ఒక ఒక మోనిటర్‌ను స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ రూ. 2.40 లక్షలు ఉంటుందన్నారు. సమావేశంలో ఎస్ఐ ప్రసాద్ పాల్గొన్నారు.

సాధారణ చార్జీలతోనే ప్రత్యేక బస్సులు


ప్రయాణికులతో మాట్లాడుతున్న డీపీటీఓ చెంగల్‌రెడ్డి

తిరుపతి అర్బన్: మిచాంగ్ తుపాన్ నేపథ్యంలో విజయవాడకు వెళ్లే పలు రైళ్లు రద్దు చేసిన నేపథ్యంలో సోమవారం ఆర్టీసీ బస్టాండ్‌కు విజయవాడకు వెళ్లాల్సిన పలువురు ప్రయాణికులు చేరుకున్నారు. దీంతో సమాచారం అందుకున్న జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తిరుపతి నుంచి విజయవాడకు 20 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌కు 3 ప్రత్యేక సర్వీసులు సమకూర్చారు. ఆ మేరకు డెప్యూటీ సీటీఎం భాస్కర్, డీఎం బాలాజీ, ఏటీఎం రామచంద్రనాయుడు, అసిస్టెంట్ టీఎం పద్మావతి తిరుపతి బస్టాండ్‌లో ట్రాఫిక్‌ను పర్యవేక్షించారు. ప్రత్యేక సర్వీసులను ఆటంకాలు లేకుండా ఎప్పటికప్పుడు రద్దీని బట్టిని నడపనున్నట్లు ఎస్టీఐ బ్రహ్మం, సూపర్‌వైజర్లు సత్యనారాయణ, ఈఆర్ కుమార్, ఎంటీఆర్ రెడ్డి తదితరులకు బాధ్యతలు అప్పగించారు.

యూటీఎఫ్ జిల్లా నూతనకార్యవర్గం

 
సోమశేఖరనాయుడు, మణిగండన్

చిత్తూరు కలెక్టరేట్ : యూటీఎ ఫ్ జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు ఆ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్ష కార్యదర్శులు కొమ్మెజు శ్రీనివాసరావు, రాష్ట్ర రఘుపతిరెడ్డి వెల్లడించారు. సోమవారం వారు మాట్లాడూతూ జిల్లా అధ్యక్షుడిగా సోమశేఖరనాయుడు (ఐరాల), జిల్లా ప్రధాన కార్యదర్శిగా మణిగండన్ (విజయపురం) ఎన్నికయ్యారన్నారు. అలాగే గౌరవాధ్యక్షుడిగా సుధాకర్‌రెడ్డి (తవణంపల్లె), సహాధ్యక్షులుగా మునిరత్నం(నగరి), రెహానాబేగం (యాదమరి), కోశాధికారిగా ప్రసన్నకుమార్ (గంగవరం) ఎన్నికయ్యారని తెలిపారు. నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ సంఘం బలోపేతం, టీచర్ల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.